శరణుఘోష



జలంధర

"శరణమయ్యప్పా...." ఒక్కసారిగా దాదాపు ఒక వందమంది కంఠాలలోనించి శబ్దతరంగాలు గాలిలోస్పందించి వాతావరణాన్ని మంత్రిస్తున్నాయి.

మరొక్కసారి....మరొక్కసారి ఉప్పెనగాలిలా శరణుఘోష....శరణమయ్యప్పా...."

ఎవరికో పూనకమొచ్చింది.

వాకిట్లో డప్పుల శబ్దం, చాలా విచిత్రంగా వుంటుంది ఆలయం. మనిషిలో అంతఃశక్తులమీద నరాల పీడన స్పందనలమీద పనిచేస్తుందది; మనస్సును హిప్నొటైజ్ చేసి, ఊహను మొద్దుబరచి, ఏకాగ్రతనిచ్చి ఒకే భావనమీద కేంద్రీకృతమయ్యేటట్లు చేస్తుంది. అదుగో అప్పుడే పూనకాలు వస్తాయి. వాతావరణంలోని చైతన్య శక్తిని "ఫిజికల్"లోకి ఆవాహన చేసి మాట్లాడిస్తాయి.

భావన, భావము ఒకటైనప్పుడు, ధ్యాన్నా ధ్యాత్రధ్యేయ రూపం ఒకటైనప్పుడు రూపుదాల్చేది దైవత్వం. కానీ, అలాకాక, భక్తిమితం దాటిపోయినప్పుడు, ఆవేశపు పై పొరలు విచ్చుకుని సబ్‌కాన్షియస్‌లో ఒదిగిన ఆలోచనా సరళి, కోరికల కోటలు, ఎగో – ఇవన్నీ బైట పడతాయి, ఈ పూనకంలో. దీనికి దైవత్వం ముద్ర పడటం కూడా జరుగుతుంది సాధారణంగా. అలాంటప్పుడే సత్యము, సుందరము, అయిన దైవత్వము, మనిషిలోని అహంకార స్వరూపమైన 'నేను' అనే భావన ఈ రెండూ పడుగు పేకల్లాగా అల్లుకుని పోతాయి. అందుకనే అప్పుడు చెప్పేవి కొన్ని నిజాలౌతాయి, కొన్ని అబద్ధాలవుతాయి. వీటిని మూఢంగా నమ్మినప్పుడు కొన్ని జీవితాలే మారిపోతాయి.

చేతులు కట్టుకుని, స్థంభానికి ఆనుకుని ఆ పెద్ద బంగళాలో చీకటి చారలో నిలబడి దూరంగా పెద్ద హాల్లో జరుగుతున్న తంతు అంతా చూస్తూ ఆలోచిస్తున్నాడు భార్గవ.

పెద్ద వదిన–ఆ ఇంటి యజమానురాలు గబగబా పట్టుచీరతో, తలపిడపతో లోపలికి వస్తూ ఆగి,

"ఎవరక్కడ? నువ్వా భార్గవా? అరె ఇక్కడున్నావేమిటి? అక్కడ అంత పూజ అదీ జరుగుతూంటే...రా! అన్నయ్య కేకలేస్తారు...." అనేసి హడావిడిగా వెళ్ళిపోయింది.

అటే చూస్తున్నాడతను. సహనము, ఓర్పు, సౌందర్యము వున్న వదిన ఈ ఇల్లు ఇలా వుండటానికి చాలా దోహదం చేసింది. ఇవ్వాళ వచ్చిన అతిధులందరికీ తన చేతుల్తో బాదంపీరులు అందిస్తున్న వదినకు ఆనాడు అన్నయ్యతోపాటు తాగిన పదిహేను పైసల చుక్క కాఫీ రుచి గుర్తుంటూనే వుంటుంది. ఆ విషయం ఎవరికీ అర్థమవకపోయినా, చిన్నప్పటి నుంచీ ఆమె చేతుల్లో పెరిగిన భార్గవకు బాగా తెలుసు.

"ఏమిటి ఇక్కడే వున్నావు? రా!" ప్రసాదాలు పట్టించుకుని వెళుతూ అన్నది.

"అదికాదు వదినా" నసుగుతూ అన్నాడు.

"ఏమిటి?" అసహనంగా ప్రశ్నించింది.

"స్నానం చెయ్యలేదు." గబుక్కున అన్నాడు.

"ఊఁ! ఇదొకసాకు....త్వరగా స్నానం చేసిరా. ఇంకా చాలా టైం ఉన్నదిలే."

"వదినా!"

"మళ్ళీ ఏమిటి?"

"నీతో మాట్లాడాలి." గోళ్ళు చూసుకుంటూ అన్నాడు. తలకాయ వంచుకుని మాట్లాడుతున్న ఆ పాతికేళ్ళ పసిబిడ్డలాంటి మరిదిని చూసి ఆ హడావిడిలో కూడా నవ్వు వచ్చిందామెకు.

"ఇప్పుడా! వుండు కాసేపు ఆగు వస్తాను."

"ఇందిరా!" అన్నగారి గొంతు.

"వస్తున్నా!" అంటూ పరుగు పెట్టిందామె.

ముగ్గురన్నయ్యలు, వదినలు, ఇంకా చుట్టాలు, బంధువులు మొత్తం అందరూ ఈ ఇరుముడుల పూజ కోసం మూడురోజుల ముందు నుంచీ వచ్చి, ఇల్లంతా హడావిడి చేసేస్తున్నారు. ఇంత మందిలో బాధ్యత మాత్రం పెద్ద వదినదే.

"ఆఁ! చేసే వాళ్ళకెప్పుడూ తప్పదులేవయ్యా!" అనేసి హడావిడిగా పనిలోకి వెళ్ళిపోతుందామె.

"ఊ చెప్పు త్వరగా ఏమిటి మాట్లాడాలన్నావు?" కొంగుకు చెయ్యి తుడుచుకుంటూ దగ్గరకు వచ్చిందామె.

"వదినా!"

"ఊఁ!"

"నాకొక కలవచ్చింది" గబుక్కున అన్నాడు భార్గవ.

ఏనాడు నవ్వనంత గట్టిగా నవ్వింది ఇందిర.

"ఏమిటి? మీ అన్నయ్య కెమెరాలో నుంచి కనిపించే కలర్ డ్రీమా....ఇది చెప్పడానికేనా ఇప్పుడు ఇంత హడావిడిలో?"

"అదికాదు వదినా! కొంచెం సీరియస్‌గా విను" ఆవేదనగా అన్నాడతను.

"ఊ చెప్పు...."

"ఆ కలలో...."

"ఊ....ఆ కలలో?"

"దేముడు కనిపించాడు వదినా."

"ఏమిటీ .. నీకా? పారాసైకాలజీ చదివి నీకు బుర్ర పోయిందయ్యా"

"ఏం వదినా? కనిపించడంటావా?" పరీక్షగా చూస్తూ అన్నాడు.

"ఇంకా నయం —" తలపిడప విప్పి ఆరబెట్టుకుంటూ అన్నది ఇందిర.

"మరి ఆ కనబడని, లేడనేవాడి కోసరం ఈ పూజలన్నీ దేనికి వదినా?"

తక్కున తిరిగింది ఆమె.

"అదా నాయనా నీప్లాను. సంతోషించాంలే నీ తెలివికి. నీకు ఇదంతా జోక్‌గా కనిపించినా, ఈ నలభై అయిదు రోజులన్నా వీళ్ళు మిగతా 320 రోజులు ఎలా బ్రతుకుతున్నాము అని ఆలోచించుకుంటారు భార్గవా! దయచేసి ఈ పూజ గురించి తప్పుగా మాట్లాడకు. ప్లీజ్...."

"అదికాదు వదినా?"

"ఇంకేం చెప్పకు" వెళ్ళిపోతోంది.

"వదినా!" ఆ గొంతులో ఆర్తికి వెనక్కి తిరిగింది.

"వదినా! నిజం నా కలలో అటు వెలుతురూ, ఇటు చీకటీ కాని ఒక రేఖ లాంటి బాక్‌గ్రౌండ్‌లో నీలం రంగులో వుండు అది నీలం కాదు వైలట్ కూడా కాదు. ఓహో....ఆ రెండు రంగుల మధ్య వుండే ఊదారంగు అనుకో. విచిత్రమైన ఆ కాంతిలో ఒకఫిగర్ కనిపించింది వదినా! కనిపించి," కళ్ళు మూసుకుని ఆగిపోయాడు భార్గవ.

గబగబా దగ్గరకు వచ్చింది ఇందిర.

"భార్గవా!" అని రెక్క పట్టుకుని కుదిపింది.

కళ్ళు తెరచి, "నిజం వదినా...." అన్నాడు. అతని కళ్ళల్లో తమాషాగా తడి వున్నది.

"ఏమిటిది భార్గవా? పిచ్చా, చాదస్తమా? ఇదంతా సైకలాజికల్ నాన్సెన్సు అనే నువ్వేనా ఇదంతా మాట్లాడేది?"

అతడు మాట్లాడలేదు.

"ఊ! కనబడి...." అసహనంగా అన్నది ఇందిర.

"నీ చుట్టూ మనుష్యులు భగవంతుడి పేరుతో చేసే ఈ న్యూసెన్స్ అంతా నమ్మలేరు నీవంటి వారు. కానీ, 'కాస్మిక్ ఎనర్జీ'నీ నమ్ముతావు కదూ!

దాన్ని టాప్ చెయ్యడానికి, దానితో ఇన్స్టాకనెక్షన్ ఏర్పడడానికి ఈ మెడిటేషన్, కాన్సన్ట్రేషన్ వగైరా! చూడగలిగిన కళ్ళు నీకున్నప్పుడు ఆ ఎనర్జీ కాసేపు 'ఫిజికల్ ఫాం'లో కనబడుతుంది. అంటే నీలో ఎక్స్ట్రా సెన్సుయరీ పవర్ (E S P) నిద్ర లేవాలన్నమాట ...అంతే!'' అన్నాడు.

"ఇంగ్లీషులో మాట్లాడాడా?'' వచ్చే నవ్వు ఆపుకుంటూ అడిగింది ఇందిర.

"అది భాష కాదు వదినా! ఏదో కోడ్‌లా... జస్ట్ 'థాట్ ట్రాన్స్‌ఫరెన్స్....' చాలా విచిత్రమైన అనుభవం....''

"అంటే, నీకు ఇంగ్లీషులో ఫ్లూయన్సీ ఉన్నది కాబట్టి అలా అర్థమైందంటావా?'' ఆలోచిస్తూ అడిగింది.

శ్రావణ శుక్రవారం నాడు అమ్మవారికి బేసరి, పూలజడ, కాసుల పేరుతో అలంకరిస్తూంటే,

"అమ్మవారు నీకు అచ్చు ఇలాగే, నీలాగే ఉంటుందని ఎలా తెలుసు వదినా?'' అనేవాడు చిలిపిగా భార్గవ.

"ఏమో...నాకు ఇలాగే కనిపిస్తుంది....'' అనేది నవ్వుతూనే ఇందిర.

"అదే మరి....పంజాబీ ఆవిడకు పంజాబీ డ్రస్‌లో రెండు జళ్ళతో, యూరోపియన్ లేడీకి ఫ్రాక్‌తో బాబ్డ్ హెయిర్‌తో....ఇలా ఎవరికి కావలసినట్లు వాళ్ళకు కనిపిస్తుంది కాబోలు పాపం. అమ్మవారు పాపం ఫాన్సీ డ్రస్సులు వేసుకోవాలి పండగ పండక్కీ'' అనేసి తిట్లు తిని పారిపోయే చిలిపి భార్గవ గుర్తుకు వచ్చాడు.

"'ఓ! గాడ్' చూశావా రాత్రి విడియోలో....''

"జోక్ కాదు వదినా....అది సరే .... చాలా విచిత్రమైన విషయం చెప్పాడు.''

"అదేమిటి?''

"ఇవ్వాళ మీ ఇంట్లో పూజకదా. నేను వస్తాను. గుర్తుపట్టు. ప్రయత్నించు. అన్నాడు వదినా''

"భార్గవా!'' ఖంగారుగా అన్నది ఇందిర.

"అవును వదినా! మళ్ళీ టాల్‌స్టాయ్ కథ చదివావా? అనకు. నిజం,'' అతని గొంతులోని నిజాయితీకి కదలిపోతోంది ఇందిర. కానీ, ఎలా? ఎలా నమ్మడం?

"అన్నిట్లోకీ విచిత్రం. అది కల కూడా కాదేమో వదినా ఏదో విజన్ లాగా....''

"అదేమిటి మళ్ళీ'' ఉలిక్కిపడుతూ అన్నది.

"అవును. ఎందుకంటే నేను అప్పుడు నిద్ర పోవడం లేదు. చాలా సెన్సిబుల్‌గా ఉన్నాను. వాతావరణంలో ఒక్కసారిగా విభూధి వాసన,''

"అదేముంది? దేముడి గదిలోనుంచి వచ్చి వుంటుంది,'' తేలిగ్గా అనేయాలని ప్రయత్నిస్తూ అన్నది ఇందిర.

"ఏమో. అప్పుడు నా వెన్నెముకలో ఏదో జలదరింపు.''

"భార్గవా'' అతని రెండు భుజాలు పట్టుకుని కుదుపుతూ అతని కళ్ళల్లోకి చూస్తూ అన్నది భయంగా ఇందిరా.

"ఏదో భగవంతుడు అనేవాడు కాసేపు పూజ చేసుకోవడానికీ, మనస్సు పవిత్రంగా అట్టే పెట్టుకోవడానికీ పనికి వస్తే బావుంటుంది కానీ, ఇలా కనబడి...''

"ఏమిటి వదినా! నీలో నువ్వే మాట్లాడుకుంటున్నావు?''

"చూడు భార్గవా! స్నానం చేసి దేముడి గదిలోకిరా ముందు. తరవాత చూద్దాం'' గబగబా ఆలోచించుకుంటూ వెళ్ళిపోయింది ఇందిర.

ఆలోచిస్తున్నాడు భార్గవ. అతనేం చిన్నవాడు, అమాయకుడు, జ్ఞానం లేనివాడు కాదు. ఈ దేముళ్ళు, దేవతలు, ఆచారాలు, మడులు, తాయత్తులు, యంత్రాలు—వీటని అడ్డం పెట్టుకుని భగవంతుడి పేరుతో గుడి, చర్చి, మసీదు ఇలా రకరకాల విధానాలతో మనిషి మీద, అతని ఆత్మ స్వతంత్రత మీద చలాయించే జులుం అంటే మొదటి నుంచీ విపరీతమైన జుగుప్స అతనికి. అందుకే ఎలాగూ నిత్యజీవితంలో కొంత న్యూసెన్సును తప్పించుకోలేమని తెలిసే, అదేమిటో తెలుసుకోవాలని చాలా ప్రయత్నించాడు. పారా సైకాలజీ చదివాడు. వేదకాలం నాడు భగవంతుణ్ణి ఇలా భయంకర విగ్రహారాధనతోనూ, పూజారి ఇచ్చే అర్చన టిక్కెట్లతోనూ చూడాలని ప్రయత్నించలేదు ఆనాటి వారు. కారణం, వారిలో సర్వ చైతన్యంలోనూ సర్వేశ్వర సందర్శన చెయ్యగలిగిన జ్ఞానం ఉండేది. ఇప్పుడు ఆ వెలుగు ఎలా మరుగున పడిందో అతనికి అర్థమవలేదు. స్వార్థపరుడైన మనిషి సర్వేశ్వరత్వం తన ఆశయం అనుకోక, సర్వేశ్వరుణ్ణి తన స్వప్రయోజనాలకు, ఉపయోగపడేలా మార్చుకోవాలని ప్రయత్నం చేసి పతనంలో పడ్డాడని అర్థమైంది అతనికి.

ఇంత తెలిసి, చదివిన అతనికి తన 'విజన్' తనకే అర్థం కావడం లేదు.

స్నానం చేసి పూజ హాల్లోకి వెళ్ళాడు.

"ఓరి నువ్వా!'' అన్న భావం అందరి ముఖాలలోనూ కనిపించింది "అసలీ భగవత్సక్తి ఏమిటి?'' అనే ఆలోచించే భార్గవ, కళ్ళు మూసుకుని చెప్పిన మాట వినడు కాబట్టి 'నిరీశ్వరవాది' అని చాలామంది ఉద్దేశం.

పెద్దన్నగారు కెమెరామాన్....విభూతి పట్టాలు పెట్టాడు. చిన్నన్న విడియో కెమారాను అతని కనుగుణంగా తిప్పాడు.

విభూది పళ్ళెం, మధ్యలో హారతి, అరటి దూటలతో కట్టిన మండపం, పద్దెనిమిది మెట్లు చుట్టూ ఎలక్ట్రిక్ బల్బులు - ఆపకుండా వేస్తున్న ధూపాల మధ్య అయ్యప్ప మెరిసిపోతున్నాడు.

చుట్టూ చూశాడు భార్గవ.

తాదాపు అందరూ తెలిసిన వాళ్ళే .... ఇందులో మాలతీసి కోరికలు తీర్చుకుని, మళ్ళీ "మాల'' వేసుకునే బలహీనులు, తప్పులు చేస్తూ "సర్వం పరబ్రహ్మార్పణమస్తు''అనుకునే లౌక్యులు....చాలా నిష్ఠగా వ్రతనియమాలు చేస్తూ, దాని వెనకాల వుండే సర్వేశ్వరతత్వం మర్చిపోయేవారు—ఇలా చాలా మంది వున్నారు.

వద్దనుకుంటూనే ఆలోచిస్తున్నాడతను.

"ఇవ్వాళ మన మతం సైన్టిఫిక్‌గా ప్రూవ్ అయిందండీ ...విభూది ధరించడం వల్ల శరీరంలో ఎలక్ట్రో మాగ్నెటిక్ వేవ్స్ ఎఫెక్ట్ అవుతాయట'' అబ్‌స్ట్రాక్ట్ సబ్జెక్ట్ మాట్లాడం కూడా ఒక ఫాషనే అనుకునే ప్రొడ్యూసర్ కాబోలు అంటున్నాడు.

"మతం సంగతి నాకు తెలియదు కానీ బాబూ, ప్రస్తుతం మాత్రం మీ ఇజాలకు, సైన్సుకూ భగవంతుడు అందడయ్యా! సైన్సు భగవంతుణ్ణి వెతుక్కోవాలి. సత్యాన్ని తెలుసుకోవాలి. దానికి చాలా కాలం పడుతుంది.'' ఎవరో పెద్దాయన చెబుతున్నారు.

సత్యం....అదంటే ఏమిటసలు?!

That which kept befoie your mental mind, your spiritual miend, will continue to develop you upwards'' అన్న ఎడ్గర్ కెయిసీ గుర్తుకు వచ్చాడు.

ఫలహారాలు ప్రారభమైనాయి. చాలా 'గందర

గోళంగా వున్నది. గురుస్వాములు కొందరు సాక్షాత్తు భగవంతుడిలా ప్రవర్తిస్తుంటే, మరి కొంత మంది అహంకారం మూర్తీభవించినట్లున్నారు.

"ఇవ్వాళ వాళ్ళ కాల్‌షీట్ - ఇలా కానిచ్చెయ్యండి .." ఎవరో సర్దేస్తున్నారు" నిజమే మరి. ఇటువంటప్పుడే వారి 'అహం' సంతృప్తిపడేది.

కానీ భార్గవకు ఇప్పుడవన్నీ మామూలుగా ఆలోచించే సమయం లేదు. అందరి ముఖాలూ పరీక్షగా చూస్తున్నాడు.

"ఎలా కనిపిస్తారు?"

ఇదంతా నిజమా? మనసు ప్రశ్నిస్తోంది.

కానీ, ఎందుకో ఏదో తెలియని నమ్మకం ఒక అలలా వచ్చి, అతని సందేహాన్ని ముంచేస్తోంది.

అతనికి ఆ గోలలో తృప్తిగా లేదు. వాళ్ళందర్నీ తప్పించుకుని వచ్చి బైటకు నడిచాడు భార్గవ. పిల్లిని, కుక్కనూ కూడా పరీక్షగా చూస్తున్నాడు. చుక్కల్నీ, చంద్రుణ్ణీ కూడా పరిశీలిస్తున్నాడు.

చీకట్లో, గేటు దగ్గర నీడలా ఎవరో....గబాల్న పరిగెత్తాడు. రాత్రి దాదాపు పదిగంటలైంది.

ఎవరో వీధి బిచ్చగాడు....పరమ వృద్ధుడు.

సత్తుగిన్నె పట్టుకుని నిలబడి ఉన్నాడు....చలికి ఒణుకుతున్నాడు.

"బాబూ! ఆకలి...." అన్నట్లు ఎండిపోయిన కడుపు, ఖాళీ గిన్నె చూపించాడు.

"కొంచెం అన్నం పడెయ్యండతనికి..." ఎవరో పనివాడు కనబడితే చెప్పాడు భార్గవ.

"ఉండండి బాబూ! చెయ్యి తీరికెక్కడిది? అయ్యప్పలు ఫలహారాలు చేస్తున్నారు." వెళ్ళిపోయాడు పనికుర్రాడు.

ఆ బిచ్చగాడు అలాగే నిలబడి ఉన్నాడు. భార్గవ రెండు చేతులూ వెనక్కు పెట్టుకుని పచార్లు చేస్తున్నాడు కానీ, ఏదో ఇబ్బందిగా ఉంది. ఆ బిచ్చగాడు అలా నిలబడితే విసుగొచ్చి, లోపలికి వచ్చి చిన్న వదినకు చెప్పాడు.

'ఉండవయ్యా! అయ్యప్పల విస్తళ్ళెత్తితే పుణ్యమట." వండకపోతే మానే, వడ్డించడానికి కూడారాని చిన్నవదిన విస్తళ్ళెత్తితే వచ్చే పుణ్యం కోసరం ప్రలోభపడుతోంది.

మిగతావాళ్ళు 'ఇదుగో వస్తున్నాం' అన్నారే కానీ, రాలేదు. పెద్ద వదిన కోసరం వెతికాడు... కనిపించలేదు.



అక్కడ దాదాపు వందమంది మనుష్యులు, ఆకలితోకాక, మర్యాదకో, భక్తికో, తప్పనిసరయ్యో, నియమానికి కట్టుబడో భోజనాలు చేస్తున్నారు. కానీ, ఆకలితో అలమటించి పోతున్నవాడికి, నిజంగా అవసరమైనవాడికి అన్నం పెడదామంటే దాదాపు అరగంట అయింది.... అతీగతీ లేదు.

దేముడి గదిలోకి తొంగి చూశాడు. దేముడి నైవేద్యం కాబోలు రెండు అరటిపళ్ళు ఉన్నాయి. గభాల్న పట్టుకుని బైటకు నడిచాడు.

అలాగే, ఆ గోడకానుకుని నిలబడి ఉన్నాడు ఆ బక్క చిక్కిన వృద్ధుడు.

అరటిపళ్ళు సత్తుగిన్నెలో వేశాడు.

ఆత్రంగా ఒలుచుకుని తినబోతున్నాడు. ఎవరో పసిపిల్లవాడు ఒంటిమీద బట్టలు కూడా సరిగ్గాలేవు. చలిలో, రోడ్డుకు అడ్డంగా పరిగెత్తుకు వచ్చాడు.

"ఆకలి ..." అంటూ అతి దీనంగా చెయ్యి చాచాడు. తలెత్తి ఒక్కసారిగా భార్గవ వంక చూసి, ఎండిపోయిన పెదవులు, మాసిపోయిన తెల్లటి గెడ్డంలోనించి విషాదంగా, సన్నగా ఒక చిన్న నవ్వు నవ్వి ఆ అరటిపళ్ళు ఆ పిల్లాడి చేతులో పెట్టాడు ఆ వృద్ధుడు.

ఆ కుర్రాడి కళ్ళల్లో తృప్తి....ఆ ఆప్యాయతా దీపాలు, మణికంఠుడికి వెలిగించే మకర జ్యోతుల్లా వెలిగాయి.

"పిలిచావా భార్గవా?" పెద్దవదిన వరండాలో నించి అరిచింది.

"ఆఁ! అవును వదినా! కొంచెం ప్రసాదం పట్రా! పాపం ఎవరో ముసలివాడు." అతని వంకే చూస్తూ అన్నాడు భార్గవ.

తెచ్చింది ఆమె.

చినుకులు పడుతున్నాయి. మెరుపులు మెరుస్తున్నాయి. గేటు దగ్గర నుండి వచ్చి ఇందిర చేతులలోని ప్రసాదం తీసుకుని వెనక్కి తిరిగి వచ్చాడు భార్గవ....ఏముందక్కడ?! ఎవ్వరూ లేరు. చుట్టూ చూశాడు. ఒక్క నెకను కూడా కాలేదే... రోడ్డుకి అటు ఇటూ చివరివరకూ ఆ ప్రసాదం గిన్నె పట్టుకుని పిచ్చివాడిలా పరిగెత్తాడు.

"ఏమైంది భార్గవా?" ఖంగారుగా అడిగింది ఇందిర గేటు దగ్గరకు వస్తూ.

"ఎవరో ముసలివాడు వదినా పాపం..." ఏదేదో చెప్తున్నాడు అటూ ఇటూ చూస్తూ.

"ఇంతకీ నీ విషయం ఏమైంది భార్గవా? ఎవరైనా కనబడ్డారా?'

"ఆ...." చెల్లబోయాడతను. ఆ గందరగోళంలో అసలు విషయాన్నే మర్చిపోయాడు.

"వదినా! ఇప్పుడు వచ్చినతను...." నోట మాట రావడం లేదు. తడబడుతూ జరిగిందంతా చెప్పాడు భార్గవ.

నిశ్చేష్టురాలై వింటూ ఉండిపోయింది ఇందిర.

"భార్గవా! నేను పిచ్చిదాన్ని అనుకోకుండా ఉంటే ఒక నిజం చెప్పనా?" సాలోచనగా గేటు వంక చూస్తూ అన్నదామె.

ఆమె అప్పుడు మామూలు వదినలాగా అనిపించలేదు భార్గవకు. మంచి ఇల్లాలైన ఆడదానిలో మరుగున దాగుండే వ్యక్తిత్వం ఎంత అపూర్వమైనదో తెలిసినా, ఆ క్షణంలో దాన్ని గురించి ఆలోచించే స్థితిలో లేడు భార్గవ.

"భారతం మొత్తం మీద ఎన్నిసార్లు కృష్ణుడు విశ్వరూప దర్శనం ఇచ్చాడంటావు?"

"నాలుగైదు సార్లు అనుకుంటా....ఏం?'' సాలోచనగా అన్నాడు.

"అవును! భీష్ముడితోపాటు, విదురుడితోపాటు దుర్యోధనాదులతో సహా చాలామందికి ఆ దర్శన భాగ్యం లభించినా, ఆయన భగవంతుడని, ఆయన చేతిలో 'నియతి' ఉన్నదనీ మిగతావాళ్ళు ఎందుకు గ్రహించలేకపోయారంటావ్?! సాక్షాత్తు సర్వేశ్వరుడే సారథ్యం వహిస్తున్నాడని తెలిసినా, ధృతరాష్ట్రుడు ఏం మారాడంటావ్! కారణం? మాయ... కాబట్టి సర్వేశ్వర దర్శనమైనంత మాత్రాన సర్వం తెలుస్తుందనుకోకూడదేమో...''

ఆశ్చర్యంగా ఆమెవంక చూస్తున్నాడు భార్గవ. తెలివిగలవాడు కాబట్టి ఆమెను మాట్లాడిస్తున్నాడు.

"వదినా! ఈ నిష్ఠాగరిష్ఠులనబడే వాళ్ళు, నియమ నిష్ఠలతో గురుత్వంతో భయపెట్టే వీళ్ళు నిజజీవితంలో ప్రతి అల్ప విషయానికీ స్వార్థపరులై పోతూంటే ఎలా భరించమంటావ్? అని పోట్లాడే వాడివి గుర్తుందా? నిజం అది... జిలుగు వెలుగు లాంటి ఆ ఆనందానుభూతి ఏ కాసేపో వీళ్ళను పునీతుల్ని చేసినా, మరుక్షణం నించీ వీళ్ళు మాయలో పడిపోతారన్నమాట. దేముడు కనిపించదేం అనే ఈ మనుష్యులు సర్వేశ్వరుడు ఎదురు పడితే గుర్తుపడతారంటావా? నైవేద్యాలు తినిపోతే పోషిస్తారంటావా?...."

"మరి ఈ గందరగోళం అంతా దేనికి వదినా?''

అదే నేను చెప్పేదీను.... ఆ లోపల గందరగోళంలో దేముడున్నాడా లేదా అన్నది కాదు ప్రశ్న....ఆ శరణు ఘోషలో, ఆ ఆర్తితో కూడిన ప్రతి పిలుపులో నాబోటి దానికి సర్వేశ్వరుడి ప్రతిధ్వని వినిపిస్తూనే ఉంటుంది. కానీ..మామూలుగా వింటే అది గోలే. ఆ ఆర్తితో, ఎన్నో అడ్డంకులు దాటి, ఏడుకొండలు నడిచి ఎక్కి వెంకటేశ్వర సన్నిధిలో ఐదునిమిషాలు నిలబడ్డాచాలు అనుకునే భావన ఆ సన్నిధికి పవిత్రతనిస్తుంది. విలువనిస్తుంది. అక్కడ గార్డు డ్యూటీలో ఉన్నవాళ్ళు ప్రతిక్షణం భగవంతుడి సన్నిధిలోనే ఉన్నా పనికిమాలినవన్నీ మాట్లాడుకుంటారు. భక్తుల్ని, ఆర్తుల్ని చూసి అక్కడ భగవంతుడున్నాడంటావా? వీళ్ళందరినీ చూసి ఆ ఇక్కడేం దేముడు!! అనుకుంటావా?''

అక్కడ ప్రశ్నించేది వదినకాదు అతని వివేకం. ఏమనగలడు?

అందుకే కూరను పదిసార్లు కలియబెట్టే గరిట కన్న, ఒక్క విసరుతో రుచి చెప్పగలిగిన నాలిక గొప్పదన్నాడు భర్తృహరి...ఏమంటాడు భార్గవ?

"సర్వేశ్వరుడు కనబడతాడనుకున్న నువ్వు, అతనికోసం వెతుకుతున్న నువ్వు, ఆకలి, ఆర్తి అంటున్న అతణ్ణి బిచ్చగాడనుకున్నావు. కారణం. భగవంతుడి గురించి నీకు నువ్వే కల్పించుకున్న ఊహ....''

"వదినా!'' ఆమెలో ఏదో కొత్తవ్యక్తిని చూసి నట్లుంది భార్గవకు.

"ఇన్ని వందల మందికి మర్యాదలు చేస్తున్న మనం పిడికెడు అన్నం అవసరమన్న వాడికి పెట్టలేకపోయాం....భగవంతుడే వస్తే మనం ఏమివ్వగలమయ్యా రిక్తహస్తాలు, శూన్య హృదయాలు తప్ప....'' కొంగుతో కన్నీళ్ళు తుడుచుకుంటూ అన్నది ఇందిర. దూరంగా ఎక్కడో మెరుపు మధ్య ఎవరో నీలి ఉదారంగు వ్యక్తి నడిచిపోయినట్లు అనిపించింది అతనికి. అటు పరిగెత్తిపోయి ఆగిపోయాడు అతను.

"ఇందిరక్కా! వచ్చి పనివాళ్ళకు అన్నాలు పెట్టుబాబూ! ఆ వెధవగోలంతా ఎవరుపడతారు!'' అరిచింది చిన్న వదిన.

"వస్తున్నానమ్మా'' అంటూ కొంగు బిగించి పరిగెత్తింది ఇందిర.

అటేచూస్తూ ఆలోచిస్తూ నిలబడి పోయాడు భార్గవ. వదిన అమాయకత్వంతోనూ, ఆర్తితోనూ చాలా అందమైన నిజాలు చెప్పింది. బహుశ ఎడ్గర్ కెయిసీ చెప్పిన ఆ 'పాయింట్' ఇదేనేమో....

భార్గవ మేధస్సు పదునెక్కుతోంది.

గాలిలో విభూది వాసనలు....

అవి అయ్యప్ప భజన మందిరం నుంచో, లేక విశ్వవ్యాప్తి అయిన సర్వేశ్వరుడి విభూది విలాసమో కానీ గాలిలో వ్యాపిస్తూనే వున్నాయి. □

ఈ కథ రాయడానికి ప్రేరణ ఏమిటి? కారణం ఏమిటి? అని అడుగుతున్నారు నన్ను.

ఏ కళకైనా ప్రేరణ ఏమిటి అసలు?! వైబ్రేషన్....సృష్టి శక్తిలోని లయతో మనలోని భావన స్పందించడం.

ఇహ కారణం ఏమిటి?! మనలో స్పందించే ఆ సున్నితమైన భావాన్ని చెప్పలేనివారు కన్నీళ్ళతో చెప్పగలమనుకునేవారు గీతగా, గేయంగా, అక్షరమాలగా అందిస్తారు. ఈ నివేదన ఏ కొద్దిమంది ఆవేదనను తీసెయ్యగలిగినా చాలు ఆ కళ బతుకుతుంది.

ఇవే ఏ కళకైనా కారణం, ప్రేరణ కూడా నేమో... ఈ కథకూ అంతే.

ఎంత కాదని ఎంతమంది అన్నా మన జీవితాల మీద 'దైవత్వం' అనే ఒక మహాశక్తి యొక్క ప్రభావం తప్పడం లేదు. వీధికొక గుడి, జిల్లాకు ఒక మతం, కులానికొక పద్ధతి, వర్గానికొక వ్యవస్థ — వీటికి ఉన్నాడనో, లేడనో ఏదో ఒక రకంగా సర్వేశ్వరుడు కేంద్రబిందువు అయిపోతున్నాడు. భాగవత హృదయం లేనప్పుడు భగవద్దర్శనమైనంత మాత్రాన భగవత్తత్వం అర్థమవదు....

కారణం?! ఈశ్వరత్వాన్ని పొందవలసిన మనిషి ఈశ్వర్ తత్వాన్నే తెలుసుకోలేక శిశుత్వం — అప్పుడప్పుడు పశుత్వం పాలు కూడా అవుతున్నాడు.

ఇది చెప్పాలనే ఈ కథలో ప్రయత్నించాను. నిజానికి ఇది కథ మాత్రమే కాదు. గుండె చీకటి కోణాల్లో ఎక్కడో ఆత్మసంగతే మర్చిపోయి బ్రతుకుతున్నప్పుడు ఏదో అనాహత శబ్దంతో వినిపించిన ఆ అడుగుల చప్పుడు, అక్కడ వ్యాపించిన 'కాంతి'— వినిపించిన సంగీతం—అవాటి నుంచీ నా అన్వేషణ....

ఇదే దీనికి ప్రేరణ.

జలంధర